

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
మంగళవారం | నవంబర్ 28, 2023 | www.navatelangana.com



తాయిలాలు ఘురూ..

నేటి సాయంత్రం 5గంటలకు ముగియనున్న ప్రచారహోరు

- 48 గంటల సైలెన్స్ పీరియడ్ ప్రకటన •బల్క్ ఎస్ఎంఎస్‌లూ నిషేధమే
- కొత్తపుంతలు తొక్కించిన ప్రచారతీరుకు తెర
- నమ్మకమైన కార్యకర్తలను రంగంలోకి దింపిన కీలక నేతలు
- ఇప్పటికే బూత్‌లెవల్‌లో డంప్ అయిన నగదు

నేటి (మంగళవారం) సాయంత్రం 5గంటలకు ఎన్నికల ప్రచారహోరుకు తెరపడనుంది. నెల రోజులుగా మోగిన మైక్‌లు, నాయకుల హడావిడి, సభలు, సమావేశాలు, ప్రచార పరుగులు ఆగిపోనున్నాయి. ఇక పోలింగ్‌కు మరో రెండు రోజుల గడువు ఉండటంతో కీలకఘట్టమైన తాయిలాలకు నేతలు తెరలేపారు. ఇప్పకే స్థానిక సంస్థల నేతలను నయానో బయానో కొందరు మచ్చిక చేసుకోగా.. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు 'రేటు' ఫిక్స్ చేసి మరీ పార్టీ మార్పించేశారు. ఇక పలుమార్లు నియోజకవర్గాల్లో తమ బలాబలాలు, ఓటర్ల నాడిని తెలుసుకున్న ఆయా పార్టీల అభ్యర్థులు 'ఓట్ల కొనుగోలు'కు రంగం సిద్ధం చేశారు. అయితే ఇందుకు ద్వితీయశ్రేణి నాయకులను కాదని ఆయా బూత్‌లెవల్‌లోనే నమ్మకమైన కార్యకర్తలకు తాయిలాల బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. ఏదేమైనా నేటి సాయంత్రం 5గంటల తరువాత 48గంటలు సైలెన్స్‌పీరియడ్‌ప్రకటన జారీకాగా.. అంతే సైలెంట్‌గా తాయిలాల పంపిణీ వేగం కానుంది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఈనెల 30న నిర్వహించనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలను సందర్భంగా పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెన్స్ పీరియడ్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ సమయంలో రాజకీయపరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్‌లను పంపరాదని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు (కలెక్టర్లు) ప్రకటనలు జారీ చేశారు. ఆయా జిల్లాలోని అసెంబ్లీ ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలను ఉల్లంఘించేలా అభ్యంతరకరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపితే విచారణ జరిపి భారత శిక్ష స్మృతి (ఐపీసీ) ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తన నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు/ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా ఎస్ఎంఎస్‌లను పంపేందుకు అయ్యే ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో నేటి సాయంత్రం 5గంటల నుంచి ప్రచార మైక్‌ల వాహనాలు, నాయకుల ప్రచారాలు బంద్‌కానున్నాయి.

నమ్మకమైన కార్యకర్తలతోనే తాయిలాల పంపిణీ...

ఎన్నికల ప్రచారంలో పార్టీల నేతలు కొత్త పుంతలు తొక్కారు. ప్రచార బాధ్యతలను ద్వితీయ, తతీయ శ్రేణిలకు వారం రోజులుగా అప్పగించలేదు. డివిజన్‌లు, ఆయా గ్రామాలు, వార్డుల్లో ఒక కొత్త బాధ్యుడిని నియమించుకుని ప్రచారం సాగించారు. మొత్తం పనులను వారికే అప్పజెప్పారు. ప్రధానంగా ప్రజా నాడి పసిగట్టడం, ప్రచార తీరుతెన్నులను పరిశీలిస్తూ అవసరమైతే మార్పులు సూచించే పనిలో పెట్టుకున్నారు. ఈ మేరకు ఆయా కొత్త బాధ్యుతలు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందరు నాయకులు ప్రత్యేకంగా యాప్‌లు రూపొందించుకుని తమ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితావివరాలను అందులో నిక్షిప్తం చేసుకున్నారు. రోజూ వంద మంది ఓటర్లతో మాట్లాడటం, వారి మనోగతం గురించి తెలుసుకుంటూ ప్రచారంలో మార్పులు చేసుకుంటూ చివరి ఘట్టానికి చేరుకున్నారు. మరోవైపు ఓటరు స్లిప్‌లను పంపిణీని పూర్తి

▸ వివరాలు 2 లో...

అర్హులైన ప్రతి ఒక్కరికీ 120 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెలెల్ల బాలకృష్ణ
- పేదలతో కలిసి భారీ ప్రదర్శన

నవతెలంగాణ-జగిత్యాల

అర్హులైన ప్రతి ఒక్కరికీ 120 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లేలేల్ల బాలకృష్ణ అన్నారు. జగిత్యాల రూరల్ మండల టీఆర్‌నగర్ గుట్ట శివారులోని సర్వే నెంబర్ 437/12/2 2.20 ఎకరాల స్థలంలో గుడిసె వేసుకుని పోరాటం చేస్తున్నారు. సోమవారం ఆ స్థలంలో పేదలతో కలిసి భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వర్ణవెంకట్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు లెలెల్ల బాలకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ జీవో నెంబర్ 58 ప్రకారంగా 120 గజాల ఇంటి స్థలం ఇచ్చి, పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ. 15 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెంటు భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం భూమి ఇచ్చే వరకూ తమ పోరాటం ఆగదు అని పేర్కొన్నారు. నిరుపేదల పక్షాన ఎర్రజెండా పోరాటం చేస్తోందని, పేదలందరూ ఐక్యంగా ఉంటే సమస్య పరిష్కారం



అవుతందని పిలుపునిచ్చారు. గర్వందుల రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూతం సారంగపాణి, జిల్లా కన్వీనర్ జి. తిరుపతి నాయక్, సులోచన మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగొండ పద్మ, ఆవాజ్ జిల్లా ప్రదాన కార్యదర్శి రజియా సుల్తానా, ఇండ్లు స్థలాలా పోరాట కమిటీ నాయకులు సిరికొండ చంద్రయ్య, రఫిక్, వెలగపల్లి వెంకటాచారి, సుధారాణి, సలీం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.





నిరసన తెలుపుతున్న గ్రామ ప్రజలు

సిరికొండలో రసమయికి నిరసన సెగ

- తాగునీటి సమస్యపై నిలదీత..

నవతెలంగాణ - ఇల్లంతకుంట

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు సోమవారం నిరసన సెగ తగిలింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని సిరికొండ గ్రామంలో ప్రచారానికి వచ్చిన రసమయిని గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. తాగు నీటి సమస్య పరిష్కారం కాలేదని, అంతేకాకుండా గ్రామ చెరువులో ముంపునకు గురి అవుతున్న దాదాపు 200 ఎకరాల రైతుల భూముల పరిష్కారం కాలేదని నిలదీశారు. ఈ సమస్యలు పరిష్కరించిన తరువాత గ్రామానికి రావాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసులు ఎంత వారించినా వినకుండా దాదాపు అరగంట నిరసన తెలియజేశారు. అభ్యర్థితో మాట్లాడిస్తామని నాయకులు, పోలీసులు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అనడంతో వేరే దారి నుండి తమ ప్రచారం కొనసాగించి అక్కడి నుండి వెళ్లి వేరే గ్రామంలో ప్రచారం కొనసాగించారు.

అర్వింద్‌ను చిత్తుగా ఓడించాలి

తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను చిత్తుగా ఓడించాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ దళితులకు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బిజెపి దళిత వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో దళితులపై దాడులు, వివక్షతతో కట్టి చంపుతున్నారన్నారు. మందకృష్ణ మాదిగ బీజేపీ దళిత వ్యతిరేక పార్టీ అని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు



మాట్లాడుతున్న నాయకులు

బీజేపీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం అని చెప్పడం ఎంత ని ప్రశ్నించారు. బీజేపీకి 30 ఏండ్ల మాదిగల ఓట్లను మూటకట్టి తాకట్టు పెట్టారని విమర్శించారు. కేవలం అధికారదాహంతో మోసపూరితమైన మాటలతో తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి తప్ప మరి మీ కాదని విమ ర్శించారు. కోరుట్ల బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ దళిత రక్షణ చట్టం ఎస్సీ, ఎస్టీని అత్యాచార చట్టాన్ని లొట్టపీస్ చట్టంగా మాట్లాడడం అవివేకం అని విమర్శించారు. మన సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యమని కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణను సస్యశ్యామలంగా పరిపాలన సాధించు కుందాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎం హెచ్‌డీ వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను కనకరాజు మాదిగ, టీఎంహెచ్‌డీ జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం మాదిగ, మాదిగ సంఘాల ఫ్రంట్ అధ్యక్షులు కొక్కెర భూమన్న మాదిగ, ఇబ్రహీంపట్నం మండల మాదిగ సంఘం అధ్యక్షులు బొమ్మెన గణేష్, చిట్యాల వినోద్, ఇటుక గోపి, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

తాయిలాలు షురూ..

▸ మొదటిపేజీ తరువాయి

చేసుకున్నారు. ఈ సమయంలో ఆయా బస్తీలు, డివిజన్లు, వార్డుల్లో జనాల అభిప్రాయాలు సేకరించుకున్నారు. స్థానికంగా కీలక నేతలను ప్రలోభాలకు గురిచేస్తూ.. తమ వైపు తిప్పుకోవడంలోనూ డివిజన్ బాధ్యులే కీలకంగా వ్యవహరించారు. మహిళా, యువజన, కాలనీ సంఘాలతోనూ వీరే ప్రత్యేకంగా సమావేశమై వారి డిమాండ్లను నాయకుల చెవిలో పడేయగా.. వారి పరిష్కారానికి హామీలు ఇచ్చారు. కొన్ని చోట్ల డబ్బులూ పంపిణీ చేశారు. ఈ తతంగంలో కార్యకర్తలు అడిగినవన్నీ ఇచ్చేశారు. అంతా తామై.. అన్నింటా తామై నడిపిస్తున్న బాధ్యులకు కార్యకర్తలు చుక్కలు చూపిస్తున్నారు. అడిగింది ఇవ్వకపోతే తర్వాత రోజు ప్రచారానికి డుమ్మా కొడుతుండటంతో.. ఏది అడిగినా వెంటనే వారికి సమకూర్చారు. ఒక్కో కార్యకర్తకు రోజూ రూ.వెయ్యి, బిర్యానీ, మద్యం ఇలా ఏది కావాలన్నా అది అందించారు. మరికొన్ని చోట్ల క్యాంప్ ఆఫీసుల్లోనే రోజూ కార్యకర్తలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మాంసాహారం, రాత్రి మందుపార్టీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

పోలింగ్‌కు పకడ్బందీగా బందోబస్తు

జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు సిబ్బందితో పాటు 10 బీఎస్ఎఫ్ కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు జిల్లాకు వచ్చాయని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసుల విధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. కేంద్ర సాయుధ బలగాలను క్రిటికల్ పోలింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

స్టేషన్లల్లో రూట్ బందోబస్త్, స్ట్రాంగ్ రూమ్, కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని ఉంచడం జరుగుతుందన్నారు. అలాగే చెక్ పోస్ట్ దగ్గర పటిష్ట నిఘా ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లోకల్ పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి గొడవ లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి అధికారి కషి చేసి ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, బీఎస్ఎఫ్ అడిషనల్ కమాండెంట్ లియాన్, అసిస్టెంట్ కమాండెంట్లు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ జానీమియా, బిఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

నవతెలంగాణ-రాయికల్ : పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ముంజ ధర్మపురిగౌడ్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. రాయికల్ మండల జర్నలిస్టు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ వద్ద ఆయన చిత్రపటానికి సోమవారం కొవ్వొత్తులతో నివాళ లర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా జర్నలిస్టుగా పని చేస్తూ అనేక మందికి మార్గ నిర్దేశం చేసి మార్పు తీసు కొచ్చిన విద్యావేత్త అకాల మరణం చెందటం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు నాగిరెడ్డి రఘుపతి, నాగ మల్ల శ్రీకర్,వాసరి రవి, కడకుంట్ల జగదీశ్వర్, పటేల్ నరేందర్, వాసం లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

బ్రూస్‌లీ జయంతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మార్షల్ ఆర్ట్స్ యోధుడు బ్రూస్‌లీ 82వ జయంతి జే.కే.ఎస్ ఇండియా షోటోకాన్ కరాటే అసోసి యేషన్ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన శిక్షకులు మాస్టర్ ప్రవీణ్ కుమార్ శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ముందుగా బ్రూస్ లీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కరాటే కోచ్‌లు విశాల, విశ్వ తేజ, ప్రదీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణవ్ గెలుపు కోసం పూజలు

నవతెలంగాణ - జమ్మికుంట

హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు గెలుపు కోసం జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని శివాలయంలో ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ ప్రాంత ప్రజలు అధిక మెజార్టీతో ప్రణవ్‌ను గెలిపించాలని, గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పొన్నం చంద్రమౌళి గౌడ్, పోల్సాని ప్రభాకర్ రావు, పోల్సాని సంతోష రావు ,కల్లెపెల్లి జంపయ్య ,కట్కూరి కోమాల్ రెడ్డి ,శ్రీనివాసరెడ్డి, పింగిలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలి

మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-మల్లాపూర్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఆర్మీ బిఎస్ఎఫ్ బలగాలతో ర్యాలీ నిర్వహించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విని యోగించుకోవాలన్నారు. ఎన్నికల అప్పుడు ఏమైనా గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్ మండల కేంద్రంలో సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్రాల బలగాలు కవాత్



కవాతులో పాల్గొన్న అధికారులు

నిర్వహించాయి. పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ వరకు ర్యాలీ తీశారు. వీరికి అడుగడుగునా విద్యార్థులు పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్సై కిరణ్‌కుమార్, కోరుట్ల ఎస్సై కిరణ్ కుమార్ , కానిస్టేబుల్ పురుషోత్తం,నవీన్ పాల్గొన్నారు.

కుటుంబ పాలనను అంతం చేయాలి

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

నవతెలంగాణ - జమ్మికుంట

తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతం చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. సోమవారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సకలజనుల విజయ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పాటైన తెలంగాణలో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏం లేదని, పూర్తిగా కెసిఆర్ కుటుంబానికి లాభం చేకూరిందని ఆరోపించా రు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్, ఈటల సతీమణి జమునారెడ్డి, స్థానిక జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, యాప్ టీవీ సీఈవో పాడి ఉదయానందరెడ్డి, నాయకులు ఎర్రబెల్లి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి

నవతెలంగాణ -మెట్‌పల్లి : కాంగ్రెస్ నాయకుడు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు . తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితుడై బీఆర్ఎస్‌లో చేరినట్టు తెలిపారు. కోరుట్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ గెలుపునకు కృషి చేస్తానన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ ఐటీ సెల్ మండల అధ్యక్షుడు

నవతెలంగాణ -మెట్‌పల్లి : బీజేపీ ఐటీ సెల్ మండల ఇన్‌చార్జి, బీజేపీ ఐటీ సెల్ జగిత్యాల జిల్లా కోర్ కమిటీ మెంబర్ మారం పెల్లి నాగరాజు బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. అతనికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల సన్మానం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మూడు బొమ్మల మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో 2000-1 బ్యాచ్‌కు చెందిన నాల్గో తరగతి పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయుడు కిషన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూర్యం, ప్రశాంత్, దేవేందర్, ప్రమోద్, వెంకటేష్, రమేష్, సంజీవ్, రాజేందర్, తిరుపతిలు ఉన్నారు.

బిఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఓడించండి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట

హుజూరాబాద్ నియోజ కవర్గంలో బిఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ బాబును గెలిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి కోరారు. పిలుపునిచ్చారు. సోమవారం జమ్మికుంట పట్టణంలో



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థి,నిరుద్యోగుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో, కెసిఆర్ కుటుంబ, అరాచక పాలన కొనసాగుతోందని విమర్శించారు. నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఒక్కరోజు కూడా సందర్శించలేదని, ఎమ్మెల్సీగా కౌశిక్‌రెడ్డి మండలిలో నిరుద్యోగుల సమస్యపై ప్రశ్నించింది లేదని అన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మదారాపు రత్నాకర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నునవత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు అంబ్రిష్, సాయి పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు అయిన తంగళపల్లి,మండేపల్లి,ఇందిరమ్మ కాలనీ, లను డిఎస్పీ, ఎస్.ఐ లతో కలిసి సోమవారం పరిశీలించారు.క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయవలసిన భద్రత చర్యల మీద అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా క్రిటికల్ ప్రాంతాల్లో వీలైనంత ఎక్కువగా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు, నిర్వహించి ఓటర్ల కు భద్రతా భావాన్ని కలిగించాలని జిల్లా అధికారులకు సూచించారు. స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రలోభాల గురి చేసిన భయభ్రాంతులకు గురి చేసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట డిఎస్పీ ఉదయ్ రెడ్డి,ఎస్. ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ డిఎస్పి

48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడం నిషేధం

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల



ఈనెల 30న జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలను సందర్భంగా పోలింగ్ కు ముందు 48 గంటల సైలెన్స్ పీరియడ్ లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం తెలిపారు. సాధారణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కు 48 గంటల ముందు అనగా 28.11.2023 సాయంత్రం 5.00 గంటల నుండి 30.11.2023 సాయంత్రం 5.00 గంటల వరకు సైలెన్స్ పీరియడ్ లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ ప్రసారాలను ఎన్నికల కమిషన్ నిలుపుదల చేయవలసిందిగా ఆదేశించిందని అందులో భాగంగా జిల్లాలోని అసెంబ్లీ ఎన్నికల పోటీలో అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలను ఉల్లంఘించేలా అభ్యంతరకరమైన ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపరాదని తెలిపారు. అభ్యంతరకరమైన ఎస్ఎంఎస్ లను పంపినట్లయితే విచారణ జరిపి భారత శిక్ష స్మృతి (ఐపీసీ) ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తన నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు/ ఆదేశాల మేరకు పంపిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అదేవిధంగా %మీు% లను పంపడానికి అయ్యే ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోల్ ముగియడానికి నిర్ణయించిన 48 గంటల నిశ్శబ్ద వ్యవధిలో రాజకీయ స్వభావం గల ఎస్ఎంఎస్ ప్రచారాలను నిషేధించాలని, అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఈ ఆదేశాలపై అప్రమత్తంగా ఉంటూ తేదీ 28.11.2023 సాయంత్రం 5.00 గంటల నుండి 30.1.2023 సాయంత్రం 5.00 గంటల పోల్ ముగిసే వరకు సంక్షిప్త సందేశాలను పంపరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు

ప్రతి ఓటరు.. ఓటు హక్కును వినియోగించుకోవాలి

సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల

కులం, మతం, జాతి, ప్రాంతం వంటి ప్రలోభాలకు గురవ్వకుండా స్వచ్ఛందంగా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఈ నెల 30 వ తేదీన అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ప్రాముఖ్యత కలిగినదన్నారు. అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఓటు ప్రాముఖ్యతను గుర్తించి అర్హులైన అందరూ ఎన్నికల్లో ఓటు వేసేలా చైతన్యపర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 30వ తేదీన ఎన్నికల సెలవు ఇంట్లో ఉండేందుకు కాదని, బయటకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకని సూచించారు.

చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బీఆర్ఎస్

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్ :చేనేత రంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ఆరోపించారు. ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత రంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ వస్త్ర సంస్థలకు కొమ్ము కాస్తున్నారన్నారు. గడిచిన 10 ఏండ్లల్లో వందల మంది చేనేత కార్మికులు ఆత్మ హత్య చేసుకున్నారని, వారిని మంత్రి కేటీఆర్ ఇంతవరకు పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సంఘాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో 400పై ఉన్న సహకార సంఘాలు నేటి నేడు 100కే పరిమితమయ్యా యని తెలిపారు. సహకార సంఘాలకు పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా పద్మశాలి నాయకత్వాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న చేనేతలను ఆదుకోకుండా పక్క రాష్ట్రాల్లో పంజాబ్, హర్యా నాలోని బాధితుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. స్వార్థ ప్రయో జనాల కోసం చేనేతలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చేనేత మహిళలు శ్యామల సుమతి, సింగం సంధ్య, గంజి కోమలి, చెల్లా మాణిక్యం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, కార్యదర్శి మిర్యాల శ్రీలత, రాష్ట్ర కమిటీ సభ్యులు బలరాం, రాష్ట్ర యువజన కన్వీనర్ మడత కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



1676 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటి వరకూ ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది 1676 మంది తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఫెలిసిటేషన్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యవసర సర్వీసుల్లో ఉన్న సిబ్బంది మొత్తం 39 మందికి ఏడుగురు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల 29 వ తేదీ వరకూ సిరిసిల్ల, వేములవాడ ఫెలిసిటేషన్ కేంద్రాలలో ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అత్యవసర సర్వీసులోకి వచ్చే జర్నలిస్టుల కేటగిరీలో జిల్లాలో ఇద్దరు జర్నలిస్ట్ లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఫ్లెక్సీ తొలగింపుపై వివాదం

- **ఆందోళన చేపట్టిన ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పత్తిపాక సురేష్**
- **ఆందోళనకారులు పోలీసుల మధ్య వాగ్వాదం**

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పత్తిపాక సురేష్ ఫ్లెక్సీ తొలగింపుపై సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మున్సిపల్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన ఫ్లెక్సీ తొలగించారని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పత్తిపాక సురేష్ తన అనుచరులతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. దీంతో ఆందోళన కారులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసు బలగాలు ఆందోళన కారులను చెదరగొట్టి పత్తిపాక సురేష్‌ను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అభ్యర్థి మాట్లాడుతూ.. సిరిసిల్లలో కేటీఆర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం సహకరిస్తుందని, అందు వల్లే మున్సిపల్ అధికారులు కేటీఆర్ ఫ్లెక్సీలను తొలగించకుండా, తమ ఫ్లెక్సీలను తొలగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

రాజన్నను కుటుంబ సమేతంగా దర్శించుకున్న హైకోర్టు జస్టిస్ సుజన

నవతెలంగాణ - వేములవాడ



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని తెలంగాణ హైకోర్టు జస్టిస్ సుజన కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకొని, గర్భగుడిలోశ్రీ పార్వతి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయానికి విచ్చేసిన జస్టిస్ సుజనకు పోలీసులు చేసిన గౌరవ వందనం చేశారు. ఆలయ అర్చకులు, దేవాలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేద పారాయణ మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలు, అర్చకులు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పరిరక్షకులు అల్లి శంకర్, ఆలయ ఇన్స్పెక్టర్ పవన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఆత్మీయ సమ్మేళనం..

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట





ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం మండల ముస్లిం కమిటీ అధ్యక్షుడు షాదుల్లా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, ఎంపిపి పిల్లి రేణుక, మండల కోఆప్షన్ సభ్యుడు జబ్బార్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు అందె సుభాష్, కొండ రమేష్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ మెండె శ్రీనివాస్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు బందారి బాల్‌రెడ్డి, మండల మహిళ బిఆర్ఎస్ అధ్యక్షురాలు అప్సర ఉన్నిసాలు ముఖ్యఅతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుండి ముస్లిం సోదరులు, సోదరిమనులు స్వచ్ఛందంగా కేటీఆర్‌కు ఓటు వేస్తామని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి మమ్ముల్ని ఆహ్వానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మజిద్ కమిటీల అధ్యక్షులు మహ్మద్ రఫీక్, అయాబ్, ఇర్ఫాన్, నవాబు, దావల్, షాదుల్, ఖాజా, పున్నుబాయి, మండల ముస్లిం కమిటి యూత్ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్, ముస్లిం నాయకులు ఫోటో స్టూడియో షాదుల్, మహ్మద్ లతీఫ్, సింగారం గౌస్, డాక్టర్ హైమద్, సయ్యద్ లాల్‌మహ్మద్, ఉపసర్పంచ్ ఉస్మాన్, హసన్, మజాఫర్, సత్తార్‌బాయి, బిఆర్ఎస్ నాయకులు నంది కిషన్, పందిర్ల పర్శరాములు, ఎనగందుల నర్సింలుతో పాటు 500 మంది ముస్లింలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతారు

- కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా?
- రైతుల నోటికాడ బుక్కను గుంజుకున్న కాంగ్రెస్
- అభివృద్ధి సంక్షేమంలో అగ్రభాగాన ధర్మపురి
- కేసీఆర్ చెప్పినట్టు అందరికీ ఒకేసారి దళితబంధు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-వెల్గటూర్

ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ మాయ మాటలు చెబుతోందని, ఉమ్మడి రాష్ట్రంలో 11 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలిచిందని ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం వెల్గటూర్ రోడ్ షోలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పులతో కలిసి పాల్గొని మాట్లాడారు. మోసం చేసే కాంగ్రెస్‌ను నమ్మితే గోస పడుతామని తెలిపారు. రైతులకు రైతుబంధు రాకుండా అడ్డుకున్న రేవంత్‌రెడ్డి ఆరో పించారు. రైతులు ఆందోళన పడాల్సి అవసరం లేదని, ఎన్నికల తరువాత మళ్లీ మన ప్రభుత్వమే వస్తుందని దీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందే ఇంకా డబ్బాల ఓట్లు పడక ముందే రైతు బంధును కాటగల్వే ప్రయత్నం చేసిర్రు.. చిల్లర పార్టీ కాంగ్రెస్ నాయకులు, అధికారం లోకి వస్తే రైతుబంధును తొలగిస్తారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు 24 గంటల కరెంట్ ఇవ్వారని, రైతులకు మళ్లీ కష్టాలు మొదలౌవుతాయని ఆరోపిం చారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఆకలి కేకలు, నక్సలైట్లు పోలీసు కాల్పులు, బీడు భూములు, ఎండిన చెరువులు అని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో కొత్త పథకాలను పెడుతున్నామని, డిసెంబర్ 3 తర్వాత ఈశ్వర్ ఎమ్మెల్యే వెంటనే వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. అదే విధంగా ఆసరా పెన్షన్ రూ.5వేలు ఇస్తామని, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ జీవిత బీమా, రైతు బీమా అందజేస్తామన్నారు. కేసీఆర్ ఆరోగ్యలక్ష్మి క్రింద 5లక్షలు ఉండే దాన్ని 15 లక్షల వరకూ పెడుతామని తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాలు కట్టిస్తామన్నారు. స్తంభం పెళ్లి చెక్కల కర్ర ఫ్యాక్టరీ పెడదామంటే వద్దన్నారు, దాన్ని రద్దు చేసామన్నారు. ప్రాంత ప్రజలు గోదావరి తీరంలో ఉన్నారన్నారు. మా దగ్గర పెద్ద ఎత్తున ఫిషరీస్ పండే అవకాశం ఉంది. ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టుకునే అవకాశం ఉంద న్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చల్లూరి రామచంద్రగౌడ్, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, ఎంపీపీ కొనమల లక్ష్మి, జడ్పీటీసీ బొడ్డు సుధారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



పాల్గొన్న ప్రజలు

బాండ్ పేపర్ల పేరుతో జీవన్‌రెడ్డి డ్రామాలు

బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్

నవతెలంగాణ-జగిత్యాల

బాండ్ పేపర్ల పేరుతో అల్లుడు అర్వింద్, అంకుల్ జీవన్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్ విమర్శించారు. జగిత్యాల పట్టణం లోని మోతె రోడ్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడారు. పసుపు బోర్డు తెస్తానని పార్లమెంట్ ఎన్నికల్లో అర్వింద్ బాండ్ పేపర్ రాసిచ్చి మాట తప్పినట్లే, నేడు జీవన్‌రెడ్డి బాండ్ పేపర్ విధానం కూడా ఉంటుందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన జీవన్‌రెడ్డి కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీలన్నీ ఉత్తవేనని దేవుని ముందు ఉంచి ఒప్పుకున్నట్లేనన్నారు. అసలు జీవన్‌రెడ్డి మాటలు ఎవరూ నమ్మడం లేదనే ఈ బాండ్ పేపర్ నాటకాన్ని మొదలు పెడుతున్నారని విమర్శించారు. జీవన్‌రెడ్డి రాసిచ్చిన బాండ్ పేపర్ విలువ ఎంతంటే ఆయన అల్లుడు ధర్మపురి అరవింద్ పసుపు బోర్డుపై రాసిచ్చిన బాండ్ పేపర్‌తో సమాన మన్నారు. 40ఏండ్ల రాజకీయ జీవితంలో జీవన్‌రెడ్డి జగిత్యాలకి చేసిందే మీలేక పోగా, ప్రతి పనికి అడ్డు పడుతూ అభివృద్ధి నిరోధకుడుగా మారాడని విమర్శిం చారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాలను కేంద్రం వెనుకబడిన జిల్లాలుగా ప్రకటిం చడమే పేదరికానికి నిదర్శనమన్నారు. మాట్లాడితే మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చినట్టు మాట్లాడే జీవన్‌రెడ్డి వెనుకబడిన రాష్ట్రానికి మిగులు బడ్జెట్ ఎలా ఉంటుందో చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రచారం

జగిత్యాలటౌన్: జగిత్యాలరూరల్ మండలంలోని అంతర్గాం, ఒడ్డెర కాలనీ, జగిత్యాల అర్బన్ మండలం లోని అంబారిపేట గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి అధికా రంలోకి వచ్చిన తరువాత రేషన్ ద్వారా సన్న బియ్యం అందజేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలను గడప గడపకు అందించామని, 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసీ చైర్మన్ దామోదర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, సురేందర్‌రావు, సర్పంచ్‌లు గంగాధర్, రాజమణి గంగాధర్, ఎంపీటీసీ శ్రీనివాస్, మల్లారెడ్డి, రవీందం రెడ్డి, మల్లారెడ్డి, ఆదిరెడ్డి, స్వామి రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు విరాళం అందజేత

జగిత్యాల రూరల్ మండలం పోలాస గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కే.శే. వీర్ల శంకర్ భార్య వీర్ల పద్మ ఎన్నికల ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను వారి నివాసంలో కలిసి రూ.10 వేల విరాళం అందజేశారు. వీరి వెంట నాయకులు రాజేందర్ తదితరులు ఉన్నారు.

రైతు వ్యతిరేక పార్టీలకు బుద్ధి చెప్పాలి

కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్

నవతెలంగాణ -మెట్‌పల్లి

రైతు వ్యతిరేక పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతుబంధు పథకాలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు అడ్డుకొంటూ.. రైతు వ్యతిరేక నాయకులుగా మారారన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందు రైతు రుణమాఫీ అపాలని ఎలక్షన్స్ కమిషన్‌కి లేఖ రాశారని తెలిపారు. రైతుబంధు ఆపినంత మాత్రాన బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను రైతులు దూరం చేసుకోరని, నాలుగు రోజులు ఆగితే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్ప డుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, డాక్టర్ సత్యనారాయణ, మార్గం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

అభివృద్ధిని చూసి ఓటేయండి

మల్లాపూర్: బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం మండలంలోని మొగిలిపేట గ్రామంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాల పునర్విభజన తర్వాత జగిత్యాల జిల్లాకు మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్ అవకాశం ఇచ్చారన్నారు. స్థానికంగా ప్రజల్లో ఉండి వైద్య విద్య రంగాల్లో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే డాక్టర్ సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపుల మండల నాయకులు డీలర్ మల్లయ్య, గౌరు నాగేష్, తోట శ్రీనివాస్, సరికల మహిపాల్, నత్తి నరసయ్య తోట రాజారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణంలోని 13,14,15 వార్డుల్లో జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో జువ్వాడి రత్నాకర్‌రావు చేసిన అభివృద్ధి పథకాలను వివరించారు. చేతి గుర్తుపై ఓటు వేసి జువ్వాడి నర్సింగరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే సతీమణి ప్రచారం



ప్రచార కార్యక్రమంలో దావ వసంత సురేష్, సుంకే దీవెన

నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకే రవి శంకర్‌ను రెండో సారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపిం చాలని కోరుతూ జగిత్యాల జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్, ఎమ్మెల్యే సతీమణి సుంకే దీవెన ఇంటింటా ప్రచారం సోమవారం నిర్వ హించారు. 14వార్డు సభ్యులు సంకుర్తి నరేష్ ఇంటికి విచ్చేసి వార్డు ప్రజలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు చేసిన కాంగ్రెస్ గెలుపును ఆపలేరు..

కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్

నవతెలంగాణ-మెట్‌పల్లి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

శాపనార్థాలు పెట్టినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ గెలుపును కోరుట్ల నియోజకవర్గంలో ఎవరూ ఆపలేరని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని అన్ని సర్వేల్లో తేటతెల్లం కావడంతో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఓటమి భయంతో ఏవేవోమాట్లాడు తున్నారన్నారు. నియోజవర్గ ప్రజలను భయపెట్టే విధంగా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శాపనార్థాలు పెడుతున్నారని, ధర్మపురి అరవింద్ నియంతలా మాట్లా డుతూ.. డబ్బుతో మద్యంతో గెలవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందే మారుతి బాపూజీ, కాంగ్రెస్ మెట్ పల్లి మండల ఉపాధ్యక్షుడు ఇల్లందుల రాజు, పట్టణ కార్యదర్శి కంబ సురేష్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

నవతెలంగాణ-రాయికల్



మండల పరిధిలోని వడ్డే లింగాపూర్ చెక్ పోస్ట్ వద్ద సోమవారం ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమించి అక్రమంగా మద్యం తరలిస్తున్న కట్కాపూర్ గ్రామానికి చెందిన గుడిపెల్లి అంజి వద్ద నుండి 21.2 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఎస్ టీం ఇన్‌చార్జి శరన్ తేజ తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది శేఖర్,మోహన్,మహేష్,సాయి, సతీష్ పాల్గొన్నారు.

ఓట్లకోసం వచ్చే నాయకులను నమ్మితే మోసపోతాం

▸ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని
ఓట్లకోసం వచ్చే నాయకులను నమ్మితే మోసపోతామని మంథని జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా సోమవారం మంథని మండలం గుంజపడుగు, నాగారం, ఆరెంద గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో అనేక ఏండ్లు పరిపాలన చేసిన ఒక్క కుటుంబం ఎదిగినోళ్లను ఎదిగినట్లు ఖతం చేసేందుకు చూస్తున్నారని, రాజకీయంగా ఎవరిని ఎదగకుండా అణిచి వేస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి పని కోసం పోతే మా ప్రభుత్వం లేదని మాట దాటేశాడని, మళ్లీ మనం ఓట్లు వేస్తే ఏం పనిచేస్తాడని ప్రజలు ఆలోచన చేయాల న్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే వచ్చి ఓట్ల కోసం నోట్ల సంచులు తీసుకువచ్చి ప్రజలను మభ్యపెట్టడం అలవాటుగా మారిపోయిందన్నారు. ఐదేండ్లు కాంగ్రెస్ అభ్యర్థికి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే కనీసం ఏ ఆడబిడ్డ పెండ్లికైనా పుస్తె మట్టెలు ఇచ్చాడా, ఓ బీదబిడ్డ చదువుకు రూపాయి సాయం చేశాడా అని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. తాను ఏనాడు తప్పు చేయలేదని, ఎవరిని బెదిరింపులకు గురి చేయలేదని స్పష్టం చేశారు. ఇటీవల మంథనికి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ గుంజపడుగును మండలంగా ప్రకటిస్తానని మాట ఇచ్చారని, బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే తాను ఎమ్మెల్యేగా నెలరోజుల్లో గుంజపడుగును మండలంగా ఏర్పాటు చేయించి అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అదేవిధంగా తన చిరకాల స్వప్నమైన అరెంద మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేర్చుతానని ఆయన స్పష్టం చేశారు.30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ పనులతో పాటు గ్రామాల్లో తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి పనిని పూర్తి చేసే బాధ్యత తనదేనని ఆయన హామీ ఇచ్చారు. ఆదరించి ఆశీర్వదిస్తే ఐదేండ్లు మీకు అందుబాటులో ఉండి సేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

సింగరేణి ఆర్జీ-1లో సోమారపు బాయిబాట

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ సింగరేణి ఆర్జీ-1 ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం బాయిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను కలుసుకుంటూ వజ్రం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కార్మికులను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో సోమారపు లావణ్య అరుణ్ కుమార్, పిడుగు కృష్ణ, రవి నాయక్, జనగామ రాయలింగు, సురేష్ పటేల్, సునీల్ కుమార్, అరవింద్ యాదవ్, కిషోర్, రాకేష్, తదితరులున్నారు.



కార్మికులను కలుసుకుంటున్న సోమారపు సత్యనారాయణ

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

నవ తెలంగాణ- పెద్దపల్లి
జిల్లాలో పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమ వారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ లు జే.అరుణ శ్రీ, శ్యామ్ ప్రసాద్ లాల్‌లతో కలిసి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్‌లకు పలు సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రచార సమయం పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో నవంబర్ 28 సాయంత్రం 5 గంటలకు, మంథని నియోజకవర్గంలో సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని, అనంతరం 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాల్సి ఉంటుందని అన్నారు.సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్. మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి వి.హనుమానాయక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్,పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి: ఎంఐఎం

నవతెలంగాణ, రామగుండం:
ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి కట్టుగా రామగుండం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని నియోజకవర్గ ఎంఐఎం పార్టీ నగర సీనియర్ నాయకుడు మీరు జాకీర్ అలీ, జాయింట్ సెక్రెటరీ సయ్యద్ ఖాదర్ అలీ కోరారు. ఈ మేరకు సోమవారం జాకీర్ అలీ నివాసంలో నిర్వహించిన నగర కమిటీ ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. పోలింగ్ రోజు ఓటింగ్ శాతం పెరిగేలా అందరూ కృషి చేయాలని, ప్రతీ ఒక్కరు తప్పకుండా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులంతా ఓటు వేసేలా ఎంఐఎం కేడర్ పనిచేయాలని పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆదేశించారని పేర్కొన్నారు.కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు మహమ్మద్ తాజుద్దీన్, ఖాజా మొయినుద్దీన్, మెహబూబా, ఆయేషా, హమీద్, యాకుబ్, చంటి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

ఓటు హక్కును వినియోగించుకున్న మంథని ఆర్డీవో

నవతెలంగాణ-మంథని
పోస్టల్ బ్యాలెట్ ద్వారా సోమవారం మంథని ఆర్డీవో హనుమ నాయక్ ఓటు హక్కును వినియో గించుకు న్నారు. రంగా రెడ్డి జిల్లా మహేశ్వరం నియోజ కవర్గంలో గల ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆయన వినియో గించుకున్నారు.


పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకుంటున్న మంథని ఆర్డీవో హనుమ నాయక్

అధికారంలోకి రాగానే మెడికల్ కాలేజ్ ఏర్పాటుకు కృషి

▸ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మంథని
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మంథని నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. సోమవారం మంథనిలో శ్రీధర్ బాబు నవతెలంగాణతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ పార్టీయే నని రాష్ట్ర ఆడపడుచులు పడుతున్న బాధలను చూసి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను ఇంటింటికి చేరవేస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మాట ఇస్తే చేస్తుందని అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మంథని నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.



కేటీఆర్ రోడ్ షోకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్
శాసనసభ ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి మద్దతుగా మంత్రి కేటీఆర్ హాజరయ్యే కార్నర్ మీటింగ్‌కు మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. సుల్తానాబాద్ మండలంలోని హనుమ ల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు చొప్పరి అంజన్న ఆధ్వర్యంలో సమావేశానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షు డు గరిగంటి లక్ష్మీరాజ్యం, చొప్పరి నరసయ్య చొప్పరి సదయ్య, మల్లయ్యలు పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్ రుణం తీర్చుకోవాలి

▸ రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి

నవతెలంగాణ-గోదావరిఖని:
రాష్ట్రంలో గొప్ప పాలనను అందిస్తున్న కేసీఆర్ రుణంను కారు గుర్తుకు ఓటు వేసి తీర్చుకోవాలని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ సూచించారు. సోమవారం 30వ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటుచేసిన ప్రజా అంకిత యాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రతి పేద కుటుం బానికి ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసాగా నిలుస్తూ.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు కూడా ప్రజల ముఖంలో సంతోషం లేదని అన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధిలో సమన్యాయం జరిగిందని అన్నా రు. నవంబర్ 30 తేదీన జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్ కుమార్, నాయకులు నారాయణదాసు మారుతీ, దొమ్మేటి వాసు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

బీజేపీని ఓడించడం ద్వారానే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
భారత రాజ్యాంగ స్థానంలో మను అద ర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీని తిరిగి అధికారంలోకి రాకుండా ఓడిం చడం ద్వారానే రాజ్యాంగాన్ని కాపాడుకోగ లమని, అట్టడుగు వర్గాలైన దళితుల్లో చైతన్యం కల్పించడం కోసం ప్రజా సంఘాలు, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేవీపీఎస్ కార్యాలయం వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల మీద పెద్ద ఎత్తున దాడులు దౌర్జన్యాలు పెరిగాయని అన్నారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో కేవీపీఎస్ ప్రజాసంఘాల నాయకులు మోదుంపల్లి శ్రవణ్, కుమ్మరి నవీన్, తిరుపతి, నరేష్, సదయ్య, రీనా కమల్, లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతుబంధు ఆపిన కాంగ్రెస్‌ను బొంద పెట్టండి

▸ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-సుల్తానాబాద్
రైతుబంధును ఆపిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ముందస్తు పెట్టుబడి అందించేందుకు రైతుబంధు పథకం ప్రారంభించారన్నారు. ఇప్పటికే 11 సార్లు రైతుబంధు ఇచ్చారని, కేంద్ర ఎన్నికల సంఘం సైతం రైతుబంధు నిరంతర ప్రక్రియ కాబట్టి రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు వేసుకోవచ్చని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఓటమి భయంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఫిర్యాదుతో బీజేపీ ఢిల్లీలో కుట్ర చేసి కేంద్ర ఎన్నికల సంఘం నుంచి తిరిగి రైతుబంధును వేయకుండా ఆదేశాలు ఇప్పించారన్నారు. నియోజ కవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న మనోహర్ రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. దాసరిని గెలిపిస్తే నియోజకవర్గంలో కొలనూరు, గర్రెపల్లి, పెద్దపల్లి రూరల్ మండలాలు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్‌షోలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీ వెంకటేష్ నేత పాటు బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేటీఆర్

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం గ్రామంలోని బీజేపీ ముత్తారం మండల ప్రధాన కార్యదర్శి అమ్ము శ్రీనివాస్, అలువోజు మహేందర్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు అలువోజు రవీందర్, భూపెల్లి మొగిలి, పప్పు చంద్రమొగిలి, చంద్రమౌళి తదితరులున్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం సీతంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ సభ్యులు ఏకుల ప్రదీప్, నూనెటి శివ ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సోమవారం వారికి పెద్దపల్లి జడ్పీచైర్మన్, మంథని బీఆంఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జడ్పీ చైర్మన్

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం గ్రామంలో మహిళల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీసి కాంగ్రెస్ నాయకులు 6 గ్యారంటీల గురించి వివరిస్తూ ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ముత్తారం మండల మాజీ జడ్పీటీసీలు నాగినేని జగన్మోహన్ రావు, చొప్పరి సదానందం, ముత్తారం సర్పంచ్ తూటి రజిత రఫీ, ముత్తారం మండల మహిళా అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్, సీనియర్ నాయకులు, ముత్తారం గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటీల కార్డులను ప్రజలకు వివరించి పంపిణీ చేశారు. మంథని కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

28 సాయంత్రం5 గంటల నుంచి 144 సెక్షన్ అమలు

సీపీ రెమా రాజేశ్వరీ

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్ 30న పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు నేడు సాయంత్రం 5 గంటల తరువాత నుంచి డిసెంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలి పారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచి ర్యాల జోన్ పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులు గుంపులుగా తిరగొద్దని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, ప్లకార్డులు ధరించొద్దని, ప్రదర్శించొద్దని తెలిపారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకా యలు కాల్చడం లాంటి కార్యక్రమాలను నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తులపై, ఎన్నికల సంఘం యొక్క నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.



కేసీఆర్ పాలనలో అభివృద్ధి శూన్యం

నవతెలంగాణ-మంథని:
సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధి శూన్యమని తెలుగు రాష్ట్రాల ప్రముఖ సామాజికవేత్త, రచయిత ఇంగ్లీష్ లెక్చరర్ అరుణ గోగుల తీవ్ర స్థాయిలో మండపడ్డారు. సోమ వారం మంథనిలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. 10 సంవత్సరాల పాలన గడుస్తున్న స్కూళ్ల పరిస్థితికి కేసీఆర్ చేతకాని పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో నోటిఫికేషన్లు వేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ నిరంకుశ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు.మంథని నియోజకవర్గంలో 98 ఇసుక క్వారీలు ఉన్నాయని,వాటి ద్వారా డబ్బు సంపాదిస్తున్న ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేసింది ఏమీ లేదని ఆరోపించారు.


మాట్లాడుతున్న అరుణ గోగుల

ఆడపడుచుల ఆరోగ్యం కోసమే మెడికల్ కళాశాల

- రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
గత ఎన్నికల్లో నాపై నమ్మకం ఉంచి గెలిపించిన నా రామగుండం ఆడపడుచుల రుణం తీర్చుకోవడం కోసమే మెడికల్ కళాశాల ఏర్పాటు అయ్యేలా కృషి చేశానని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం రామ గుండం కార్పొరేషన్ పరిధిలోని 42 డివిజన్ మేకల మండవలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు.రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కేసీఆర్ ఆరోగ్య మహిళ అనే పథకంతో ప్రతి మంగళవారం ఒంట్లో చిన్న కలత ఉన్న ప్రతి మహిళ పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. సీఎం కేసీఆర్ ఇటీవల విడుదల చేసిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో భవిష్యత్తులో తెలంగాణ బంగారు రూపు దాల్చుతుందని అన్నారు.కార్యక్రమంలో రామగుండం ఎన్నికల ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్ బాలరాజ్ కుమార్, నాయకులు కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, దోమ్మెటి వాసు,తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటిచందర్

పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

- పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్.మధుమోహన్

నవతెలంగాణ -పెద్దపల్లి
నవంబర్ 30న పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్.మధుమోహన్ అన్నారు. సోమవారం పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్లపై పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్. మధుమోహన్ పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నవంబర్ 28న సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచార గడువు ముగిస్తుందని, ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం పెద్దపల్లి నియోజక వర్గంలో పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచి అనగా నవంబర్ 28 సాయంత్రం 5 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ పాటించాలని తెలిపారు. స్థానికేతరులు నియోజకవర్గం విడిచి వెళ్లి పోవాలని, హెూటల్లలో, ఫంక్షన్ హాల్ లో ఉండి ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నవంబర్ 29న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అప్పగించి పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని, పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామని, అవసరమైన మేర సెక్టార్ అధికారులను నియమించామని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

నాయకులు వస్తూ ఉంటారు..పోతూ ఉంటారు...

- మంథని ప్రజాక్షేత్రంలో సేవకుడు పుట్ట మధూకర్ ఒక్కరే
- తెలంగాణ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థుల బృందం అధ్యక్షుడు చాథల్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-మంథని:
నాయకులు వస్తూ ఉంటారు పోతూ ఉంటారని,మంథని ప్రజాక్షేత్రంలో సేవకుడు పుట్ట మధూకర్ ఒక్కరే అని అభివృద్ధి చూసి వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటెయ్యాలని తెలంగాణ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థుల బృందం అధ్యక్షుడు చాథల్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం మంథని పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేవంలో మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో ఏ విద్యార్థి కూడా ఆకలితో అలమటించ కూడదని ఉద్దేశ్యంతో నియోజకవర్గ మొత్తం చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వ్యక్తి పుట్ట మధు అని గుర్తు చేశారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మాటల మనిషి కాదని, చేతల మనిషని అన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు నరేష్, సంపత్,ప్రశాంత్, ఆకాష్,రాహుల్‌లు పాల్గొన్నారు.



ఎన్నికలు సజావుగా జరిగేలా

ప్రతి ఒక్కరూ తోడ్పడాలి :సీఐ జి.సతీష్



ఎక్లాస్‌పూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మంథని
శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ప్రతి ఒక్కరు తోడ్పడాలని మంథని సీఐ జి.సతీష్ పిలుపునిచ్చారు.మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్లాస్‌పూర్‌లో సోమవారం మంథని సీఐ సతీష్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎవరు కూడా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా, శాంతి భద్రతలను కాపాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగే విధంగా కృషి చేయాలన్నారు.

ఎఫ్ఎస్‌టీ బృందాల తనిఖీల్లో

50 లక్షలు పట్టివేత

రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణ శ్రీ

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నియోజకవర్గం వర్గ పరిధిలోని ఎన్టీపీసీలో ఆదివారం రాత్రి సమయంలో బీపవర్ హౌస్ వద్ద ఎఫ్ఎస్‌టీ 8 టీం తనిఖీలలో ఒక వ్యక్తి వద్ద 50 లక్షల రూపాయల నగదును పట్టుకొని జప్తు చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు. ఆదివారం రాత్రి సివిజిల్ పోర్టల్ ద్వారా వచ్చిన కంప్లైంట్ ప్రకారం ఫ్లయింగ్ స్క్వాడ్ టీం 9 ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని ఒక ఇంటిలో నిర్వహించిన తనిఖీలలో 2,18,90,000 రూపాయల నగదు లభించిందని, ఎన్నికల నియమాల ఉల్లంఘన ప్రకారం ఎలాంటి ఆధారాలు లేనందున జప్తు చేయడం జరిగిందని, ఒక జాతీయ రాజకీయ పార్టీకి చెందిన కరపత్రాలు కూడా లభించినట్లు రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు.

మా మద్దతు శ్రీధర్ బాబుకే

డాక్టర్ భీంరావు యశ్వంత్



నవతెలంగాణ-మంథని
మా మద్దతు మంథని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకేనని భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనవడు డాక్టర్ భీంరావు యశ్వంత్ అంబేడ్కర్ తెలిపారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందన్నారు.బహుజనులు అభివృద్ధి చెందాలంటే శ్రీధర్ బాబును గెలిపించాలన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.స్వామి, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పార్టీ చీఫ్ ఆర్గనైజర్ డాక్టర్ మేజర్ చంద్రకాంత్‌లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
7
కరీంనగర్
మంగళవారం | నవంబర్ 28, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో గుమ్లాపూర్ బిఆర్ఎస్, బిజెపి నాయకులు చేరిక

నవతెలంగాణ - చొప్పదండి

మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో బిఆర్ఎస్, బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం ఆహ్వానించారు. బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు వెల్మ రఘుపతిరెడ్డి, వార్డు సభ్యులు వెల్మ మాలతి, కడారి రత్నకుమారి, బొడిగే మంగ, పెరుమండ్ల లాస్య, మండల మహేందర్, కర్ర సందీప్, బొడిగె శేఖర్, కడారి కొమురయ్య, పెరుమండ్ల రాములు, మాడ వెంకట్ రెడ్డి, రూపురెడ్డి మనోహర్‌రెడ్డి, బుర్ర దినేష్, బద్దెనపల్లి ఓదెలు, పోరండ్ల కొమురయ్య, దుంపల రవి, కనుమల్ల అనిల్, ఎలగందుల లచ్చయ్య, పోరండ్ల మోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునిగాల రాజేందర్, కోలాపురి శ్రీకాంత్, పెద్దిరెడ్డి గణపతి రెడ్డి, మండల లక్ష్మయ్య, జంపాల ప్రకాష్, ఉయ్యాల అనిల్ పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

నలుగురు అరెస్ట్

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మండలంలో సోమవారం విస్తృత దాడులు లలో సుమారు 22 లీటర్ల గుడుంబా స్వాధీన పరుచుకుని, 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఎండి అక్బర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా ఎక్సైజ్ అధికారి కరీంనగర్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ కె.నాగేశ్వర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు అని తెలిపారు. అదేవిధంగా ఇల్లందకుంట మండలం కేంద్రం నుండి మొగులిపల్లి మార్గంలో రూటు వాచ్ నిర్వహించగా అక్రమంగా మద్యం తరలిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె నాగేశ్వర్ తెలిపారు. దీనికి సంబంధించి 20000 రూపాయల విలువగల మద్యాన్ని స్వాధీనపర్చుకున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో సిబ్బంది మోసిన్ ,కుమార్ యాదవ్, కమలాకర్ ,కాసంబి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడు మృతి

నవతెలంగాణ సైదాపూర్ :

వ్యవసాయ బావిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బొమ్మకల్ గ్రామంలో పూరెళ్ల నాగరాజు (28) ఇంట్లో నోములు ఉన్నందున ఈ నెల 25న ఉదయం వ్యవసాయ బావి వద్దకు పాలు, పూలు తీసుకురావడానికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం కౌలుదారు బావివద్దకు వెళ్లగా బావిలో మృతదేహం తేలి ఉండడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెళ్లి చూడగా మృతదేహం నాగరాజు దేనని గుర్తించారు. మృతదేహం వద్ద రోధనలు మిన్నంటాయి. మృతుడి బాబాయ్ పూరెల్ల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన సింగల్‌విండో డైరెక్టర్ గజ్జల ఆనందరావు

నవతెలంగాణ - రామడుగు

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రామడుగు సింగిల్విండో డైరెక్టర్ గజ్జెల ఆనందరావు చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గజ్జెల ఆనందరావు మాట్లాడుతు.. బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ నాయకులను గుర్తించకపోవడం, స్థానిక నాయకత్వం ఒంటెద్దు పోకడలు, కార్యకర్తల పట్ల నిర్లక్ష్యం వల్ల పార్టీని వీడుతున్నట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో వీర్ల నర్సింగరావు, పూరేళ్ళ రత్నాకర్‌రెడ్డి, కొడిముంజ లేఖరాజు, కొమ్ము మహేష్, శనిగరపు స్వామి ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న మేడిపల్లి సత్యం

కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి



నవతెలంగాణ - సిరిసిల్ల

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సిరిసిల్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి పెండింగ్ పనులను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ తంగళ్ళపల్లి, మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వేరు వేరుగా ఏర్పాటు చేస్తున్న సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను, పోలింగ్ తర్వాత భద్రపరిచే ఈవిఎం స్ట్రాంగ్ రూంలను అదనపు కలెక్టర్‌లు ఎన్.ఖీమ్యా నాయక్, గౌతమ్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు ఆనంద్ కుమార్, మధుసూదన్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అన్ని విషయాల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 30 వ తేదీన ఎన్నికల పోలింగ్ కేంద్రాల తర్వాత ఈవిఎంలు బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాలకు వచ్చినందున వాటిని నియోజకవర్గం వారిగా ప్రత్యేకించిన స్ట్రాంగ్ రూం లలో భద్రపరచాలని చెప్పారు. స్ట్రాంగ్ రూం లను సీసి కెమెరా ల నిఘా లో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలన్నారు. స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఒకవేళ ఇంటర్నెట్ పనిచేయకపోతే సమాచారం అందివ్వడంలో ఆలస్యం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా కవరేజీ చేయాల్సిన విధానం, మీడియా సెంటర్ లో చేయాల్సిన ఏర్పాట్ల పై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. పంచాయితీరాజ్ ఈఈ సూర్య ప్రకాష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, డిపిఓ రవీందర్, డి పి ఆర్ ఓ దశరథం, సిరిసిల్ల, వేములవాడ తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌కు సిబ్బంది సంసిద్ధం కావాలి

డిసెంబర్ 3న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ను కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పగడ్బందీగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరెట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రెండు నియోజకవర్గాలలో కౌంటింగ్ విధులు నిర్వహించే కౌంటింగ్ సహాయ, కౌంటింగ్ సూపర్వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణా తరగతులు నిర్వహించి కౌంటింగ్ నిర్వహణపై ఎన్నికల సంఘం నిబంధనలను వివరించారు. కౌంటింగ్ సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ తరగతులలో జడ్పీ సీఈఓ గౌతమ్‌రెడ్డి, ఎన్నికల శిక్షణా పర్యవేక్షణ నోడల్ అధికారి పిబి శ్రీనివాసచారి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లు పరిశీలించిన సీపీ

నవతెలంగాణ - భగత్‌నగర్



కరీంనగర్‌లోని గవర్నమెంట్ ఎస్.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరమైన ఏర్పాట్లను సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలైన ఈవీఎంల భద్రతకై నియోజకవర్గాల వారిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాలులవద్ద పూర్తిస్థాయిలో అవసరమయిన పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసామని తెలిపారు. వీటి భద్రతకై కేంద్ర సాయుధ బలగాలని కేటాయించామన్నారు. విధుల్లో ఉన్న అధికారులకు తగు సూచనలు చేసారు. ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని కౌంటింగ్ ముగిసే వరకు ఎటువంటి భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఏసిపి నరేందర్, టూ టౌన్ సీఐ రామచందర్‌రావు, కేంద్ర సాయుధ బలగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ ఓపెన్ టోర్నమెంట్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - రామడుగు

ఉమ్మడి జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఓపెన్ టోర్నమెంట్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. మండలంలోని వెదిర అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఓపెన్ టోర్నమెంట్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి బంగారు, వెండి పతకాలను సాధించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజెపి, బిఆర్ఎస్ మోసపూరిత మాటలు నమ్మవద్దు

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని బాండ్ పేపర్‌పై సంతకం పెట్టిన వొడితల ప్రణవ్

నవతెలంగాణ - ఇల్లందకుంట

బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని.. వారి మోసపూరితమైన మాటలు నమ్మవద్దని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని విలేకరుల సమక్షంలో బాండ్ పేపర్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇస్తే తప్పని పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఆరు గ్యారెంటీలు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి అందే వరకు నిర్విరామంగా కృషి చేస్తానని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని మండలానికో స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రతి మండలంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలల నిర్మాణం చేపడుతామని తెలిపారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, పోనగంటి మల్లయ్య, జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్ సమ్మిరెడ్డి, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు ఇంగిలే రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాండ్ పేపర్ చూపిస్తున్న వొడితల ప్రణవ్

ప్రజా వ్యతిరేక బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలి

చొప్పదండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - చొప్పదండి

రాష్ట్రంలో బిఆర్ఎస్ కొనసాగిస్తున్న ప్రజావ్యతిరేక పరిపాలనకు చరమగీతం పాడాలని చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని రాగంపేట గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలు కాంగ్రెస్ కు సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పేదోడికి, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవంబర్ 30న చేయి గుర్తుపై ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపిటిసి కుందేళ్ళ కవితబాలకిషన్‌తో పాటుగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, చందు, రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కొత్తూరి మహేష్ పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ సర్కార్

నవతెలంగాణ-గంగాధర

సీఎం కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిందని కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం విమర్శించారు. గంగాధర మండలం చర్లపల్లి (ఎన్), చర్లపల్లి (ఆర్), కుర్మపల్లి, ర్యాలపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. తెలంగాణ సర్కార్ గడిచిన ఐదేళ్లలో కొత్తగా రేషన్ కార్డులు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేదన్నారు. ముంపు గ్రామాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని, చర్లపల్లి(ఎన్) గ్రామ ముంపు సమస్యను పరిష్కరిస్తామని, గ్రామస్తులకు పరిహారం చెల్లిస్తామన్నారు. ర్యాలపల్లి, కుర్మపల్లి, చర్లపల్లి(ఆర్) మీదుగా మల్యాల మండలం బలవంతపూర్ వరకు రోడ్డు నిర్మాణం చేస్తాన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని గ్రామాల్లో పెండింగ్ పనులను పూర్తి చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చే హామీలు అమలు చేస్తామన్నారు. గడిచిన 10 ఏళ్లలో తెలంగాణ సర్కారు ముంపు గ్రామాల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. స్థానికుడినని చెప్పుకునే ఎమ్మెల్యే రవిశంకర్ చర్లపల్లి(ఎన్) గ్రామ ముంపు సమస్యను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. జడ్పీటీసీ పుల్కం అనురాధనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, గంగన్న పాల్గొన్నారు.



స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా ఏర్పాట్లు

సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - వేములవాడ/ఎల్లారెడ్డిపేట



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బందికి సహాయంగా 6 బిఎస్ఎఫ్ కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు జిల్లాకు వచ్చాయని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ సబ్ డివిసన్‌కు కేటాయించిన బిఎస్ఎఫ్ కంపెనీ అధికారులు, సిబ్బందితో ఎస్పీ వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై ఎస్పీ పలు సూచనలు ఇచ్చారు. బిఎస్ఎఫ్ కంపెనీ అధికారులతో, సిబ్బందితో ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన విధులపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు, జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. కేంద్ర సాయుధ బలగాలను క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో, రూట్ బందోబస్త్, స్ట్రాంగ్ రూమ్, కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని ఉంచడం జరుగుతుందన్నారు. అలాగే చెక్ పోస్ట్ దగ్గర పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి గొడవ లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి అధికారి కృషి చేసి ఎన్నికలు విజయవంతం చేయాలని అన్నారు. ఎన్నికల పరంగా, సదుపాయాల పరంగా ఎలాంటి సమస్యలు ఉన్న అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్ వివరాలు, చెక్ పోస్ట్‌లు, జిల్లా యొక్క భౌగోళిక పరిస్థితుల గురించి బిఎస్ఎఫ్ అధికారులకు ఎస్పీ వివరించారు. ఈ సమావేశాల్లో సిరిసిల్ల డిఎస్పీ ఉదయ్‌రెడ్డి, వేములవాడ డిఎస్పీ నాగేంద్రచారి, సిఐలు శశిధర్‌రెడ్డి, కరుణాకర్, ఎస్ఐలు రమాకాంత్, రమేష్, బిఎస్ఎఫ్ కమాండెంట్, బిఎస్ఎఫ్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ 9
పెద్దపల్లి
మంగళవారం | నవంబర్ 28, 2023 | www.navatelangana.com

ప్రచారంలో దూసుకుపోతున్న దాసరి

- కేసీఆర్, కేటీఆర్ పర్యటనలతో కార్యకర్తల్లో జోష్
- దాసరి గెలుపుపై టీఆర్ఎస్ శ్రేణుల్లో ధీమా

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలతో మమేకమై ఓట్లను అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గంలో నిర్వహించిన కేసీఆర్‌సభ, కేటీఆర్,కవితల రోడ్‌షోలకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో టీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. సభలకు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో దాసరి గెలుపు ఖాయమని, తమ దృష్టి అంతా మెజారిటీపైనే అని బీఆర్ఎస్ నాయకులు చర్చించు కుంటున్నారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో పలు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాతగా ప్రజల మనస్సుల్లో చోటు సంపాదించుకున్నారు. హరితమిత్ర అవార్డు అందుకున్న దాసరిని కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించి, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించారు.ప్రభుత్వ ప్రత్యేక నిధులతో పెద్దపల్లి పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో గత 60 ఏళ్లలో చేయని అభివృద్ధి దాసరి మనోహర్ రెడ్డి తొమ్మిది ఏళ్లలో చేశారని, ఆ అభివృద్ధి, సంక్షేమ పథకాలే నేడు బీఆర్ఎస్ గెలుపుకు కారణమవు తాయని పలువురు టీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నారు.


కేటీఆర్ రోడ్‌షోకు హాజరైన జనం

కారులో వలసల జోరు

నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో రోజురోజుకు వలసలు పెరుగుతు న్నాయి. కేసీఆర్, దాసరిలు చేసే అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలుపుతున్నారు. కారులో చేరికలు పెరుగడంతో గతంలో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తారని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-గోదావరిఖని:

తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ గుమస్తాలు సుమారుగా 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎన్నికల ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్ ఇంజపురి పులేందర్ తదితరులున్నారు.

నేడు జరిగే విజయభేరి సభ విజయవంతం చేయండి

నవతెలంగాణ-మంథని:



విజయభేరి సభను విజయవంతం చేయాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమ వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళ వారం మంథని పట్టణంలో గోదావరిఖని రోడ్డు మార్గాన బస్ డిపో ఎదురుగా కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభ నిర్వహించనున్నదని,ఈ సభకు ముఖ్యఅతిథిగా ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ చీఫ్ కోఆర్డినేటర్ విజయశాంతి వస్తున్నారని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు తెలిపారు. విజయభేరి సభకు హాజరై విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

పుట్ట మధూకర్‌కే మా మద్దతు

తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

నవతెలంగాణ-మంథని:

బీసీల ఆత్మగౌరవం కోసం నిరంతరం పాటుపడే బహు జన ముద్దుబిడ్డ, బీసీ నాయ కుడు,జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కే మా మద్దతు అని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం మున్నూరు కాపు బిడ్డ జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ చేస్తున్నటువంటి కృషి అమోఘమని అన్నారు. అగ్రవర్ణాల దోపిడి నుంచి తప్పించుకోవాలంటే బహుజన బిడ్డ రాజ్యాంలోకి రావాలని, అప్పుడే బహుజన రాజ్యం ఏర్పడుతుందని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూగల మహేష్,మంచిర్యాల వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టల మల్లేష్,నాయకులు కూర శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పెగడ శ్రీనివాస్, శివకుమార్,తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఖమ్మంపల్లిలో మంథని సీఐ జి.సతీష్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈనెల 30వ తేదిన జరిగే ఎన్నికల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఫ్రీ ఇన్సిడెంట్ ఆఫ్ ఎలక్షన్స్‌గా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని, ఎవరు కూడా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా, శాంతి భద్రతలను కాపాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ప్రతి ఒక్కరు తోడ్పడాలని తెలిపారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో మంథని సీఐ జి.సతీష్, రామగిరి ఎస్ఐలు కటికే రవి ప్రసాద్, దివ్య, మంథని ముత్తారం ఎస్సై ఏ.మధుసూదన్ రావు, మంథని ఎస్ఐలు కిరణ్, రాణి, కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది, రామగిరి పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ ఉత్సవాలు

నవతెలంగాణ-మంథని:

యేసుక్రీస్తు కన్య, గర్భంలో జన్మించడం ద్వారానే లోకానికి రక్షణ, పాప క్షమాపణ దొరికిందని మంథని నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లూరి ప్రభాకర్ అన్నారు.సోమవారం మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో మంథని మండల పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవులందరి పాపాలు క్షమించడానికే ఈ లోకంలో మానవ అవతారిగా కన్య, గర్భంలో జన్మించాడని, కామ,క్రోధ, మద, మత్సరాలు లేకుండా జీవించి మానవులందరికీ ప్రేమను పంచాడన్నారు. మానవులందరి పాప పరిహారార్థమే యేసుక్రీస్తు సిలువ మరణం పొంది త్యాగమూర్తిగా నిలిచాడన్నారు.క్రిస్మస్ వేడుకలను వాడ వాడలా జరుపుతూ యేసుక్రీస్తు జన్మదిన ప్రాముఖ్యతను వివరిస్తూ నెల రోజుల పాటు క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు.

అభ్యర్థులు,ఎజెంట్లతో ఆర్వో సమావేశం

నవతెలంగాణ-గోదావరిఖని:


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో

రామగుండం నియోజకవర్గ పరిధిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం నందు నామినేషన్ అభ్యర్థులు, వారి పోలింగ్ ఏజెంట్ల చే రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతున్న వేళ రామగుండం నియోజకవర్గ పరిధిలో నవంబర్ 28 సాయంత్రం 5 గంటలకు ప్రచార గడువు ముగుస్తుందని, అనంతరం నవంబర్ 30 సాయంత్రం 5 గంటల వరకు సైలెన్స్ పీరియడ్‌గా పరిగణిస్తామని తెలియజేస్తు, ఆ సమయంలో నామినేషన్ అభ్యర్థులు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. నవంబర్ 30 పోలింగ్ తేదీ నాడు పోలింగ్ కేంద్రాలకు వచ్చే నామినేషన్ అభ్యర్థులు వారి పోలింగ్ ఏజెంట్లు తమ రాజకీయ పార్టీకి సంబంధించిన కండువాలు కరపత్రాలు, దుస్తులను ధరించకూడదని పూర్తి పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా తమ వంతు సహకారం అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ, ఏఆర్వో కుమారస్వామి, సహాయ వ్యయ పరిశీలకులు అశోక్ కుమార్, కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి తిరుపతి, మీడియా అండ్ కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజిని, నామినేషన్ అభ్యర్థులు, వారి పోలింగ్ ఏజెంట్‌లు, సంబంధిత అధికారులు ఉన్నారు.

48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



నవతెలంగాణ -పెద్దపల్లి

నవంబర్ 29, 30న పత్రికలలో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనల జారీ కోసం ముందస్తుగా జిల్లా కేంద్రంలోని ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మంథని నియోజకవర్గంలో పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచి అనగా నవంబర్ 28 సాయంత్రం 4 గంటల నుంచి, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గంలో నవంబర్ 28 సాయంత్రం 5 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ పాటించాలని, సైలెన్స్ పిరియడ్ లో ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలు లేదని, ఫలితాల వివరాలను వెల్లడించడం, పత్రికల్లో ప్రచురించడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయడం, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకొని వెళ్లడం నిషేధించినందున, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యేగా మరో అవకాశం ఇవ్వండి

రాష్ట్రంలో రామగుండంని నెంబరు వన్‌గా నిలుపుతా : ఎమ్మెల్యే కోరుకంటి

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన ఎమ్మెల్యే పదవిని సంపూర్ణంగా ప్రజల సేవ కోసం పనిచేశానని, 5 ఏళ్ల పాలనలో రామగుండాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చానని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం గోదావరిఖని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో రామగుండం నియోజకవర్గ మ్యానిఫెస్టోను ఎమ్మెల్యే విడుదల చేసి మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో 5 ఏళ్ల కాలంలో ప్రజలకు సేవ చేశామన్నారు. దశాబ్దాల కళ అయిన మెడికల్ కళా శాల ఏర్పాటు చేయించానని, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి మంజూరు చేయించానన్నారు. రామ గుండం ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. సింగరేణి, ఎన్టీపీసీ సహకారంతో చిన్న, మధ్య తరహా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకై 6 నెలలకు ఒకసారి విజయమ్మ ఫౌండేషన్ ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తానని తెలిపారు. పాత్రికేయులకు ఇండ్ల స్థలాల కేటాయింపు తదితర పనులతో పాటు ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను తీసుకొని పనులన్నీ పూర్తి చేయిస్తానని, మ్యానిఫెస్టోలో పొందుపర్చడం జరి గిందని కోరుకంటి చందర్ వెల్లడించారు. సమావే శంలో బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జీ నారదాసు లక్ష్మణ రావు, నాయకులు కౌశిక హరిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందం